బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 11 మార్చి 2025 | www.balagamtv.com | పేజీలు 4

## గ్రూప్ 1 మెయిన్ ఫలితాలు వెల్లడి..




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ గ్రూప్-1 ఫలితాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సోమవారం విడుదల చేసింది. మొత్తం 563 పోస్టుల భర్తీకి నిర్వహించిన ప్రధాన పరీక్షల్లో అభ్యర్థుల ప్రాథమిక మార్కుల వివరాలను వెల్లడించింది. అలాగే, గ్రూప్-2 అభ్యర్థుల జనరల్ ర్యాంకింగ్ జాబితా మార్చి 11న, గ్రూప్- 3 పరీక్ష జనరల్ ర్యాంకింగ్ జాబితాను మార్చి 14న విడుదల చేయనున్నట్లు టిజిపిఎస్ సి ఛైర్మన్ వెంకటేశం తెలిపారు. కాగా, ప్రాథమిక జాబితాలో వచ్చిన మార్కులపై సందేహాలున్న అభ్యర్థులు 15 రోజుల్లోగా ఒక్కో పేపర్‌కు రూ. 1000 చొప్పున చెల్లించి రీ కౌంటింగ్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు అభ్యర్థుల నుంచి రీకౌంటింగ్‌పై అభ్యంతరాలు స్వీకరించి, ఆ ప్రక్రియ ముగిసిన వెంటనే 1:2 నిష్పత్తిలో తుది జాబితాను రిలీజ్ చేయనున్నట్లు వెల్లడించారు. కాగా, గత ఏడాది అక్టోబర్ 21 నుంచి 27 వరకూ గ్రూప్-1 మెయిన్ పరీక్షలు జరిగాయి. గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో 31,383 మంది క్వాలిఫై అయినప్పటికీ.. మెయిన్స్ పరీక్షలకు మాత్రం 21,093 మంది హాజరయ్యారు.

## ఎమ్మెల్సీ స్థానాలకు ఐదు నామినేషన్లు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఐదుగురు ఎమ్మెల్సీ అభ్యర్థులు నామినేషన్ వేశారు. కాంగ్రెస్ తరపున ముగ్గురు అభ్యర్థులు అద్దంకి దయాకర్ ,శంకర్ నాయక్, విజయశాంతి అసెంబ్లీలో నామినేషన్ వేశారు. సీఎం రేవంత్ తో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క,పలువురు మంత్రులు నామినేషన్ కార్యక్రమానికి వచ్చారు. సీపీఐ తరపున నెల్లికంటి సత్యం నామినేషన్ వేశారు. ఇక బీఆర్ఎస్ తరపున దాసోజు శ్రవణ్ నామినేషన్ వేశారు. శ్రవణ్ కు మద్దతుగా కేటీఆర్ పలువురు ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వచ్చారు.

సోమవారంతో నామినేషన్ల దాఖలు చేసేందుకు గడువు ముగియనుండగా.. ఒక్క రోజు ముందు కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించింది. దీంతో సోమవారం కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. మార్చి 20న ఎన్నికలు జరగనున్నాయి. 2025 మార్చి 29తో ఎమ్మెల్యే కోటాలోని 5 ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానున్న విషయం తెలిసిందే. 21 మంది ఎమ్మెల్యేలు అవసరం. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి 39 మంది గెలిచారు. వారిలో దాదాపు 10 మంది కాంగ్రెస్‌లో చేరారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ 64 సీట్లను గెలుచుకున్న సంగతి తెలిసిందే.

తెలంగాణ ఉద్యమకారిణిగా తనకు కాంగ్రెస్ పార్టీ ప్రాధాన్యతనిచ్చిందని విజయశాంతి తెలిపారు. నామినేషన్ దాఖలు అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకుల్లా అడుక్కోవడానికి తాము బిచ్చగాళ్లం కాదని విమర్శించారు. తానెప్పుడూ పార్టీని ఏమీ అడగలేదనీ, బీసీ మహిళా నేతగా తన అవసరాన్ని కాంగ్రెస్ గుర్తించి ఎమ్మెల్సీ సీటు ఇచ్చిందని తెలిపారు. పార్టీలో కష్టపడిన వారికి తగిన గౌరవం లభిస్తుందని అన్నారు. తనను క్యాబినెట్‌లోకి తీసుకోవడం అధిష్టానం నిర్ణయమనీ, ఆ నిర్ణయం మేరకు నడుచుకుంటానని వెల్లడించారు.

ప్రజలకు సేవ చేసే క్రమంలో ఎమ్మెల్సీగా అవకాశం రావడం తనకు పార్టీ అప్పగించిన అదనపు బాధ్యతగా భావిస్తానని అద్దంకి దయాకర్ తెలిపారు. మంత్రిగా అవకాశం దక్కుతుందనేది మీడియాలో వార్తలు మాత్రమేననీ, అధిష్టానం తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంటాయని చెప్పారు. కాంగ్రెస్‌లో సామాజిక న్యాయం ఉందనీ, అందుకే ఉద్యమకారులమైన తమకు అవకాశం వచ్చిందని తెలిపారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా దయాకర్ తెలిపారు.



# ప్రాజెక్టులను అడ్డుకుంటుంది బీజేపీ నేతలే

- రాష్ట్రానికి నిధులిప్పిస్తే కిషన్‌రెడ్డికి సన్మానం చేస్తా
- మూసీకి నిధులు ఎందుకు ఇవ్వడం లేదు?
- కేసీఆర్ హయాంలో ప్రాజెక్టులు కట్టి ఉంటే ఇప్పుడీ సమస్య వచ్చేది కాదు
- 39 సార్లు కాదు... 99 సార్లు హస్తినకు వెళతా
- హరీష్ రావు మోసం వల్లే గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓడిపోయాం'
- మీడియా ప్రతినిధుల ఇష్టాగోష్టిలో సీఎం రేవంత్‌రెడ్డి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ప్రాజెక్టులు ముందుకు వెళ్ళకుండా అడ్డుకుంటుంది రాష్ట్ర బీజేపీ నేతలేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రానికి నిధులిప్పిస్తే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి సన్మానం చేసేందుకు సిద్ధమని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్ర నీటి వాటాను పూర్తిగా ఉపయోగించుకునేందుకు వీలుగా మాజీ సీఎం కేసీఆర్ ప్రాజెక్టులు నిర్మించి ఉంటే ప్రస్తుతం సమస్య వచ్చేదే కాదని అభిప్రాయపడ్డారు. సోమవారం ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల నామినేషన్ల దాఖలు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అనంతరం అసెంబ్లీ ప్రాంగణంలోని సీఎల్పీ కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు.

కిషన్‌రెడ్డి.. మెట్రో తానే తెచ్చానని చెప్పుకుంటున్నాడని, ఆయన తెచ్చిన మెట్రో ఎక్కడుందో తనకైతే తెలియదంటూ చమత్కరించారు ' రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి సహకరించడం లేదు. తెలంగాణకు నిధులు తెస్తే ఆయనకు సన్మానం చేస్తాం. ఇటీవల అఖిల పక్షం సమావేశం నిర్వహిస్తే కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ లో ఉండి రాలేదు. కేంద్ర మంత్రి మనోహర్ లాల్ కట్టర్ హైదరాబాద్ కు వచ్చేది కూడా కిషన్‌రెడ్డికి తెలియదా?, ఈటల వచ్చారు.. కానీ కిషన్‌రెడ్డి రాలేదు. మెట్రో నేనే తెచ్చానని కిషన్‌రెడ్డి అంటారు. నాకైతే జైపాల్ రెడ్డి తెచ్చిన మెట్రో కన్పిస్తోంది కానీ కిషన్‌రెడ్డి తెచ్చిన మెట్రో ఎక్కడుంది?,రీజనల్ రింగ్ రోడ్డు ఇచ్చామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు.. అదే ఇవ్వమని అంటున్నాం. అన్ని రాష్ట్రాలను కేంద్రం సమానంగా చూడటం లేదు. భూసేకరణ అడ్డుకుంటుంది ఈటల, లక్ష్మణ్. ప్రాజెక్టులు ముందుకు వెళ్ళకుండా అడ్డుకుంటుంది రాష్ట్ర బీజేపీ నేతలే. మూసీకి నిధులు తెస్తే కిషన్‌రెడ్డికి సన్మానం చేసి గండపిండేరం తొడుగుతాను. సబర్మతి, యమునా, గంగా ప్రక్షాళనకు నిధులు ఇస్తున్న కేంద్రం మూసీకి ఎందుకు ఇవ్వడం లేదు? అని రేవంత్ ప్రశ్నించారు.

తాను ఢిల్లీకి పదే పదే వెళుతున్నానంటూ ప్రతిపక్ష నాయకులు చేస్తున్న విమర్శలపై ఆయన ఘాటుగా స్పందించారు. 39 సార్లు కాదు... 99 సార్లు హస్తినకు వెళతానని స్పష్టం చేశారు. రాష్ట్రానికి నిధులిప్పిస్తే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి సన్మానం చేసేందుకు సిద్ధమని వ్యాఖ్యానించారు. కుల గణన ప్రభావమే అన్ని పార్టీలు బీసీలకు టికెట్లు ఇచ్చాయి. హరీష్ రావు మోసం వల్లే గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓడిపోయాం' అని రేవంత్ పేర్కొన్నారు. కరీంనగర్ గ్రాడ్యుయేట్ సీటులో ఆయన దగ్గరుండి బీజేపీకి ఓట్లు వేయించారని తెలిపారు. అందుకే తమ పార్టీ సిట్టింగ్ సీటును కోల్పోయిందన్నారు.

## టీడీఆర్ పేరిట భారీ లూటీ



- సీఎం చుట్టూ నలుగురు రియల్ ఎస్టేట్ బ్రోకర్లు
- తక్కువ రేటుకు కొని ఎక్కువ రేటుకు విక్రయం
- కేసీఆర్ అసెంబ్లీకి వస్తారు
- ఫార్ములా ఈ కార్ రేసులో 17న నాకు నోటీసులిస్తారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సీఎం రేవంత్ రెడ్డి రూ.వేల కోట్ల టీడీఆర్ కుంభకోణానికి తెరలేపారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ముఖ్యమంత్రి చుట్టూ ఉన్న నలుగురు రియల్ ఎస్టేట్ బ్రోకర్ల ఆధ్వర్యంలో ఈ కుట్ర నడుస్తున్నదని తెలిపారు. తక్కువ రేటుకు భూములు కొని ఎక్కువ రేటుకు అమ్మనున్నారని ఆయన విమర్శిచారు. సీఎంకు చిత్తశుద్ధి ఉంటే టీడీఆర్‌లపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మాట ఢిల్లీలో నడవడం లేదని విమర్శించారు. ఢిల్లీలో ఆయనది నడవకున్నా.. పైసలు మాత్రం బాగానే సంపాదిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌లో బీజేపీ కోవర్టులు ఉన్నారని రేవంత్ రెడ్డిని ఉద్దేశించే రాహుల్ గాంధీ అన్నారని తెలిపారు. రేవంత్ రెడ్డి విమానం ఎక్కడం.. దిగడం తప్ప చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా.. పూర్తి స్థాయి మంత్రివర్గం లేదని కేటీఆర్ అన్నారు.

బీఆర్ఎస్ హయాంలో టీడీఆర్ తీసుకొచ్చామని కేటీఆర్ తెలిపారు. జీహెచ్ఎంసీలో 400 ఎకరాల భూమిని టీడీఆర్ ద్వారా సేకరించామని చెప్పారు. అయితే రేవంత్ రెడ్డి కొత్త తరహా దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి వెనుక నలుగురు రియల్ ఎస్టేట్ బ్రోకర్లు ఉన్నారని కేటీఆర్ తెలిపారు. టీడీఆర్ ఎక్కడ ఉన్నాయోనని ఆ నలుగురు బ్రోకర్లు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని చెప్పారు. టీడీఆర్ పేరుతో వేల కోట్ల కుంభకోణానికి ఆ నలుగురితో కలిసి రేవంత్ రెడ్డి తిరుగుతున్నాడని అన్నారు. హైదరాబాద్‌లో టీడీఆర్ మొత్తం షేర్లను కొంతమంది రేవంత్ అనుచరులు విచ్చలవిడిగా కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే లక్ష చదరపు అడుగులు కొనుగోలు చేశారని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఎఫ్ఎస్ఐ నియంత్రిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. ఆప్రకటన తర్వాత ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడతారని తెలిపారు. అప్పుడు టీడీఆర్‌లను అడ్డగోలు ధరలకు అమ్మేందుకు కుట్ర జరుగుతుందని అన్నారు. టీడీఆర్‌పై రేవంత్ రెడ్డి శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

టీడీఆర్‌కు గత నెల రోజుల్లో విపరీతమైన గిరాకీ పెరిగిందని కేటీఆర్ తెలిపారు. టీడీఆర్ పేరిట భారీ లూటీ జరుగుతుందని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు విచ్చలవిడిగా టీడీఆర్ అనుమతులు ఇచ్చామన్న ఆరోపణల్లో నిజం లేదని అన్నారు. ఆ అనుమతులు ఇచ్చింది.. ఎఫ్ఎస్ఐ తీసుకొచ్చింది వైఎస్ రాజశేఖర్ రెడ్డి అనే తెలిపారు. ఎఫ్ఎస్ఐ నియంత్రణ వైఎస్ఆర్ హయాంలో ఎత్తివేస్తే.. తాము కొనసాగించామని గుర్తుచేశారు.

రాష్ట్ర రెవెన్యూను పెంచేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నించడం లేదని విమర్శించారు. డబ్బులు ఎలా కాపాడుకోవాలో సీఎం రేవంత్ రెడ్డికి తెలిసినంతగా మరే ముఖ్యమంత్రికి తెలియదని విమర్శించారు. రాష్ట్రంలో ఇసుక దందా జోరుగా సాగుతుందని ఆరోపించారు. టీడీఆర్ విషయంలో మాసివ్ లూట్ జరుగుతుందని అన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇప్పటికీ ఇచ్చిన హామీలను అమలు చేయలేదని మిగితా 2వ పేజీలో



## ప్రణయ్ హత్య కేసులో దోషికి ఉరిశిక్ష


**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

నల్గొండకు జిల్లాకు చెందిన ప్రణయ్ హత్య కేసులో ఎ 2 నిందితుడు సుభాష్ శర్మకు ఉరిశిక్ష విధించింది కోర్టు ఈ హత్య కు సహకరించిన మిగిలిన నిందితులకు జీవిత ఖైదు ఖరారు చేస్తూ నేడు నల్గొండ ఎస్సీ ,ఎస్టీ కోర్టు తీర్పు వెలువరించింది. వివరాలలోకి వెళితే 2018లో నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో జరిగిన పరువు హత్య తీవ్ర సంచలనం రేపింది. మిర్యాలగూడకు చెందిన మారుతీరావు కూతురు అమృత, అదే ఊరికి చెందిన ప్రణయ్‌లు స్కూల్ ఏజ్ నుంచే ప్రేమించుకుని 2018లో పెళ్లి చేసుకున్నారు. తన కుమార్తె కులాంతర వివాహం చేసుకుందన్న కోపంతో తండ్రి మారుతీరావు సుపారీ గ్యాంగ్‌తో 2018 సెప్టెంబరు 14వ తేదీన ప్రణయ్‌ను హత్య చేయించాడు. ఈ పరువు హత్య దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. మృతుడు ప్రణయ్ తండ్రి బాలస్వామి ఇచ్చిన ఫిర్యాదుతో 8 మందిపై 302, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు, ఆర్మ్స్ యాక్ట్ సెక్షన్ల కింద మిర్యాలగూడ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో విచారణ జరిపి 2019 జూన్ 12న 1600 పేజీల్లో చార్జిషీట్ దాఖలు చేశారు. సుమారు ఐదేళ్ల పైగా కోర్టులో విచారణ సాగగా.. ఇటీవలే వాదనలు ముగిశాయి. ఇక నేడు తీర్పు వెలువరించింది.

అప్పటి ఎస్పీ ఏవీ రంగనాథ్ పర్యవేక్షణలో విచారణ జరిపిన పోలీసులు, ప్రణయ్ హత్య కేసులో 8 మంది నిందితుల పాత్ర ఉందని నిర్ధారించారు. ఆ తర్వాత ఎస్సీ, ఎస్టీ జిల్లా సెషన్స్ కోర్టులో 5 సంవత్సరాల 9 నెలల పాటు కేసు విచారణ జరిగింది. చార్జిషీట్ నివేదిక, పోస్టుమార్టం రిపోర్ట్, సైంటిఫిక్ ఎవిడెన్స్‌లతో పాటు సాక్షులను న్యాయస్థానం విచారించింది. తుది తీర్పును వెలువరించింది.

ఈ కేసులో నిందితులు..ప్రణయ్ హత్య కేసులో ఏ-1 మారుతీరావు, ఏ-2 బిహార్‌కు చెందిన సుభాష్ శర్మ, ఏ-3 అస్గర్ అలీ, ఏ-4 అబ్దుల్లా బారి, ఏ-5 ఎంఏ కరీం, ఏ-6 శ్రవణ్ కుమార్, ఏ-7 శివ, ఏ-8 నిజాం. ఇక ఈ కేసు విచారణ కొనసాగుతున్న సమయంలోనే ప్రధాన నిందితుడు ,అమృత తండ్రి మారుతీరావు 2020 మార్చిలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ కేసులో ఏ-2 సుభాష్ శర్మ, ఏ-3 అస్గర్ అలీ విచారణ ఖైదీలుగా ఉన్నారు. మిగిలిన ఐదుగురు నిందితులు బెయిల్ పై విడుదలై కోర్టు విచారణకు హాజరయ్యారు. నేడు తీర్పు దృష్ట్యా కోర్టు వద్ద భారీగా బందోబస్తు వెలువరించారు.. తీర్పు వెలువడిన తర్వాత భారీ బందోబస్తుతో దోషులందరిని జైలుకు తరలించారు.

## దద్దరిల్లిన పార్లమెంటు



- లోక్‌సభలో ఎన్ఈపీ..
- రాజ్యసభలో డీలిమిటేషన్
- ఉభయ సభల్లో ప్రతిపక్షాల వాకౌట్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

పార్లమెంట్ బడ్జెట్ సెషన్స్ లో ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి విపక్షాలు. ఓటింగ్ అక్రమాలు, హిందీ, డీలిమిటేషన్, మణిపూర్ అల్లర్లపై విపక్షాలు ప్రభుత్వాన్ని ఊపిరాడకుండా చేశాయి. ఒకవైపు కాంగ్రెస్, మరోవైపు డీఎంకే, తృణమూల్ తదితర పార్టీలు వివిధ అంశాలపై గొంతెత్తడంతో సమావేశాలు వాయిదాల పర్వం అందుకున్నాయి. పార్లమెంట్ బడ్జెట్ రెండో విడత సమావేశాలు సోమవారం ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో ధర్మేంద్ర ప్రధాన్ తమిళనాడులోని డీఎంకేపై విమర్శలు చేయడంతో ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. డీఎంకే, ఇతర ప్రతిపక్ష పార్టీల ఎంపీలు నిరసనకు దిగడంతో 30 నిమిషాల పాటు సభ వాయిదా పడింది. పీఎం స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం శ్రీ) పథకంపై అడిగిన ఒక ప్రశ్నకు.. తమిళనాడు ప్రభుత్వం రెండు నాల్కల ధోరణితో వ్యవహిస్తున్నదని మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తప్పుపట్టారు. ఎంఓయూపై సంతకం చేసేందుకు మొదటి అంగీకరించిన తమిళనాడు ప్రభుత్వం ఇప్పుడు వైఖరి మార్చుకుందన్నారు. కర్నాటక, హిమాచల్‌ప్రదేశ్ సహా పలు బీజేపీయేతర

లోక్ సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ ఇటీవల జరిగిన ఎన్నికలలో ఓటింగ్ అవకతవకలపై గళమెత్తారు. ఓటింగ్ లో అక్రమాలు జరిగాయని, దేశవ్యాప్తంగా దీనిపై సందేహాలు ఉన్నాయనే అంశాన్ని లేవనెత్తారు. "ఓటింగ్ లో అక్రమాలు జరిగాయనే ఆందోళన అన్ని పార్టీలలో ఉంది. విపక్ష పార్టీలన్నీ ఈ అంశంపై చర్చ జరగాలని కోరుకుంటున్నాయి. ఈ అంశంపై చర్చ పెట్టాల్సిందే" నని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీంతో కాంగ్రెస్ తో పాటు ఇతర పార్టీల సభ్యులు చర్చ జరగాల్సిందేనని పట్టుబట్టారు.

ఇక రాజ్యసభలో డీఎంకే సభ్యులు జాతీయ విద్యా విధానంపై చర్చ జరపాలని పట్టుబట్టారు. డీలిమిటేషన్ అంశంపై ఆందోళకు దిగారు. దీనిపై ఎడ్యుకేషన్ మినిస్టర్ ధర్మేంద్ర ప్రధాన్.. విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలో డీఎంకే ఎంపీలకు, ధర్మేంద్ర ప్రదాన్ కు మధ్య వాగ్వాదం చెలరేగింది. "డీఎంకే సభ్యులకు విద్యార్థుల భవిష్యత్ పై శ్రద్ధ లేదు. విద్యార్థుల జీవితాలతో రాజకీయం చేస్తున్నారు. ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు"అని మండిపడ్డారు. కేంద్ర మంత్రి వ్యాఖ్యలకు నిరసనగా ఆందోళనకు దిగారు డీఎంకే ఎంపీలు. విపక్ష ఎంపీల ఆందోళనపై రాజ్యసభ వ్యవహారాల మంత్రి జేపీ నడ్డా ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఓటింగ్ వ్యవహారంపై చర్చకు పట్టుబట్టడం పార్లమెంటును అవమానించినట్లేనని అన్నారు. అదే విధంగా జాతీయ విద్యావిధానంపై డీఎంకే వ్యవహరిస్తున్న తీరు సరైనది కాదని అన్నారు. సభ్యులకు సమస్యలపై చర్చించే ఉద్దేశం లేదని, కేవలం ఆందోళనతో సభలను గందరగోళానికి గురిచేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో రాజ్యసభ నుంచి విపక్షాలు వాక్ అవుట్ చేశాయి. ఇటీవల ప్రవేశ పెట్టిన బడ్జెట్ పై చర్చతో పాటు వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లు తదితర కీలక బిల్లులకు ఆమోదం కోసం ప్రభుత్వం ప్రయత్నిస్తున్న తరుణంలో విపక్ష సభ్యుల ఆందోళనతో ఉభయ మిగితా 2వ పేజీలో

## రేపటి నుంచి బడ్జెట్ సమావేశాలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 11:00 గంటలకు ఉభయసభలనుద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగించనున్నారు. వెంటనే సభ మరుసటి రోజుకు వాయిదా పడనున్నది. ఈసారి బడ్జెట్ సమావేశాలు 10 రోజులకుపైగా నడిచే అవకాశముంది. 13న గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం తర్వాత బిజినెస్ అడ్వయిజరీ కమిటీ సమావేశం జరుగనున్నది. అందులో అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహిస్తారు? బడ్జెట్ ఏ తేదీన ప్రవేశపెడతారు? తదితరాంశాలపై స్పష్టత రానున్నది. బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ బిల్లులకు ఈ బడ్జెట్ సమావేశాల్లోనే చట్టబద్ధత కల్పించే అవకాశమున్నది. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం, ఆరు గ్యారంటీల అమలు, టీడీఆర్‌పై అవినీతి ఆరోపణలు, సాగునీటి ఇబ్బందులు, తదితర అంశాలపై రాష్ట్ర సర్కారును ఇరుకున పెట్టేందుకు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ సన్నద్ధమవుతున్నది. అందులో భాగంగానే ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో అధినేత కేసీఆర్ మంగళవారం సమావేశమై దిశానిర్దేశం చేయనున్నారు. అయితే, బీజేపీ, బీఆర్ఎస్‌లను ధీటుగా ఎదుర్కొనేందుకు రేవంత్‌రెడ్డి సర్కారు అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నది. మరోవైపు అసెంబ్లీ సమావేశాల నిర్వహణ ఏర్పాట్లలో అధికారులు బిజీగా ఉన్నారు. అందులో భాగంగానే సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో అసెంబ్లీ, ఆయా శాఖల ఉన్నతాధికారులతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సమీక్ష నిర్వహించారు. శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, లేవనెత్తిన అన్ని ప్రశ్నలకు త్వరితగతిన పూర్తి సమాచారంతో సమాధానాలు పంపాలనీ, అసెంబ్లీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సీఎస్ సూచించారు.

బడ్జెట్ సెషన్‌లో సరైన సమాచారం అందించేందుకు సంబంధిత కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలనీ, శాఖల వారీగా నోడల్ అధికారులను కూడా నియమించుకోవాలని ఆదేశించారు. వివిధ శాఖల డిమాండ్లపై చర్చ జరగనున్నందున శాఖల వారీగా పూర్తి వివరాలతో అధికారులు సన్నద్ధం కావాలని సూచించారు. సమీక్షలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, జయేష్ రంజన్, రవి గుప్తా, ముఖ్య కార్యదర్శులు మిగితా 2వ పేజీలో

## ప్రభుత్వ పాలన వైఫల్యం వల్ల ఎండిపోతున్న పంటలు

- మాజీ మంత్రి హరీష్ రావు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

జనగామ జిల్లా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి హరీష్ రావు మీడియాతో మాట్లాడారు. హరీష్ రావు మాట్లాడుతూ, ఇది ప్రకృతి వైపరీత్యం వల్ల వచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ పాలన వైఫల్యం వల్లే పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. దేవాదుల ప్రాజెక్టు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో మోటార్లు పనిచేయలేదని, చెరువులు నింపుకోలేకపోవడంతో రైతుల పంటలు తీవ్ర నష్టానికి గురయ్యాయని ఆరోపించారు. "ఈ రాష్ట్రానికి రేవంత్ రెడ్డి గ్రహం పట్టినట్లుంది," అంటూ హరీష్ రావు విమర్శించారు. పాలనలో అనుభవం లేకపోవడం వల్ల, వ్యవస్థలను కూల్చేసే విధంగా ప్రభుత్వం నడుస్తోందని అన్నారు. "మీ పాలన 20-20 విధానంతో నడుస్తోంది. ఏ పని కావాలన్నా 20% కమిషన్ కట్ చేయాలి," అంటూ ఆయన ఆరోపించారు.

గోదావరి నదిలోని ప్రతి చుక్క నీటిని ఉపయోగించి చెరువులు నింపాలి, తద్వారా పంటలు ఎండిపోకుండా వ్యవస్థను రూపొందించాలి అని హరీష్ రావు సూచించారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో పూర్తిగా వైఫల్యం చవిచూసిందని ఆయన అన్నారు. దేవాదుల ప్రాజెక్టు మోటార్లకు అవసరమైన 7 కోట్ల రూపాయలు ఇవ్వకపోవడంతో 30 రోజులపాటు మోటార్లు పనిచేయలేదని హరీష్ రావు తెలిపారు. ఫలితంగా, వరంగల్ జిల్లాలో లక్ష ఎకరాల పంట ఎండిపోయిందని అన్నారు. "మా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఒత్తిడి తేవడంతో 7 కోట్ల రూపాయలు మంజూరు చేశారు. ఇప్పుడు మోటార్లు పనిచేస్తున్నాయి, కానీ అప్పటికే రైతుల పంటలు ఎండిపోయాయి," అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రభుత్వ పెద్దలు చంద్రబాబు దగ్గరికి మిగితా 2వ పేజీలో

## హిందూ మహాసముద్రంలో మారిషస్ భారత్‌కు కీలక భాగస్వామి

- ప్రధాని నరేంద్ర మోడి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హిందూ మహా సముద్ర ప్రాంతంలో మారిషస్ భారతదేశానికి కీలకమైన మిత్రపక్షమని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ప్రధాని మార్చి 11, 12 తేదీలలో మారిషస్‌లో అధికార పర్యటనకు వెళ్తున్నారు. తన పర్యటనతో రెండు దేశాల సంబంధాలలోనూ కొత్త అపూర్వ అధ్యాయం మొదలవుతుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. హిందూ మహా సముద్ర ప్రాంతంలో మారిషస్ సన్నిహిత పొరుగు దేశం అనీ, ఆఫ్రికా ఖండానికి గేట్ వే అని ప్రధాని ఒక ప్రకటనలో తెలిపారు. భారత - మారిషస్ దేశాలకు చారిత్రక, సాంస్కృతిక, భౌగోళిక సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. గత పదేళ్లుగా ఉభయదేశాల మధ్య సంబంధాలలో గణనీయమైన ప్రగతి సాధించామని మోదీ అన్నారు. తన మారిషస్ పర్యటనతో భారత- మారిషస్ సంబంధాల మధ్య కొత్త అధ్యాయం ప్రారంభం కాగలదన్న విశ్వాసాన్ని ప్రధాని వ్యక్తం చేశారు.

# ‘పాసు పుస్తకాలతో పాత లే ఔట్ల కబ్జా’




● హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదులు

**బలగం టీవీ, హైదరాబాద్**

తండ్రులు అమ్మారు, తనయులు వచ్చి పాసు పుస్తకాలు తమ పేరిట సష్టించుకుని పాత లే ఔట్లను చెరిపేసి పంట పొలాలుగా సాగు చేసేస్తున్నారని హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదులందాయి. సోమవారం హైడ్రా నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 63 ఫిర్యాదులందాయి. ఇందులో పాతలేఔట్ల ఆక్రమణలే ఎక్కువగా ఉన్నాయి. ఇందులో రహదారులు, పార్కులు కూడా ఉన్నాయని వీటిని కాపాడాలని పలువురు ఫిర్యాదులందజేశారు. లే ఔట్లలో రహదారులను కబ్జాచేయడం, పార్కులు కలిపేయడం వంటివి జరుగుతున్నాయని అన్నారు. అలాగే మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, వార్డు మెంబర్లు అధికారాన్ని అడ్డం పెట్టుకుని కబ్జాచేస్తున్నారని వారిపై ఫిర్యాదు చేసినా స్థానిక అధికారుల నుంచి స్పందన ఉండటంలేదని పలువురు వాపోయారు. తుర్కయాంజల్ చెరువులోకి వెళ్లే వాన నీటికి అడ్డంగా గోడ కట్టేయడంతో వరద మా కాలనీని ముంచెత్తుతోందని ఏవీనగర్-2కు చెందిన నివాసితులు ఫిర్యాదు చేశారు. ఘట్కేసర్ మండలం, ప్రతాప్ సింగారంలో మొత్తం 25.17 ఎకరాల్లో 390 ప్లాట్లతో 1989లో లే ఔట్ వేయగా, అందులో 88 ప్లాట్లు కబ్జాకు గురయ్యాయని, మొత్తం 6.14 ఎకరాల భూమి తనదంటూ ధరణి ద్వారా పాసు పుస్తకాన్ని సష్టించి కబ్జా చేశారంటూ ప్లాట్లు కోల్పోయిన వారు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. తండ్రి అమ్మగా అతని కుమారుడు ఇప్పుడు కబ్జాచేశారని, రైతు బందు పథకం కింద డబ్బులు కూడా తీసుకున్నారని వాపోయారు. తాము ఫిర్యాదు చేయగా అధికారులు రైతుబందును వాపసు చేయాలని నిర్ణయించారని, అయినా కబ్జా నుంచి వైదొలగడంలేదంటూ అక్కడి ప్లాట్ల యజమానులు ఫిర్యాదు చేశారు. మొత్తం లే ఔట్లలో రహదారులు, పార్కులు చెరబట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మేడిపల్లి మండలం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దేవేందర్‌నగర్ కాలనీ సర్వే నంబరు 63/1లఓని 1200 గజలా ప్రభుత్వస్థలాన్ని కబ్జాచేసేస్తున్నారని, పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాలకు ఆ స్థలాన్ని కేటాయిస్తే మంచి క్రీడామైదానం సమకూరుతుందని దేవేందర్‌నగర్ కాలనీ వీకర్ సెక్షన్ సొసైటీ ప్రతినిధులు హైడ్రాకు వినతి పత్రం అందజేశారు. రంగారెడ్డి జిల్లా తుర్కయాంజల్ మున్సిపాలిటీలోని శ్రీరంగాపూరంలోని 24వ వార్డులో 1050 గజాల పార్కు స్థలాన్ని అక్కడి మాజీ ప్రజాప్రతినిధి కబ్జా చేశారని, శ్రీరంగాపూరం కాలనీ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. అక్కడ 6 కాలనీలకు వెళ్లే దారిని కూడా కబ్జా చేయడంతో దారి లేకుండా పోయిందని హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులను స్వీకరించిన అధికారులను వెంటనే విచారణ చేపట్టాలని కమిషనర్ రంగనాథ్ ఆదేశించారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టు కు ప్రతిష్టాత్మక అవార్డు

**బలగం టీవీ, హైదరాబాద్**

శంషాబాద్ ఎయిర్‌పోర్టు ప్రతిష్టాత్మక అవార్డు దక్కింది. ఎయిర్‌పోర్టు కౌన్సిల్ ఇంటర్నేషనల్‌లో ఎయిర్‌పోర్టు సర్వీస్ క్వాలిటీ సర్వేలో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మరోసారి అవార్డు దక్కింది. 2024 సంవత్సరానికి గాను ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ఏడాదికి 15 నుంచి 25 మిలియన్ల ప్రయాణీకులతో బెస్ట్ ఎయిర్‌పోర్టుగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు నిలిచింది. ఎయిర్‌పోర్టు కౌన్సిల్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు సర్వీస్ క్వాలిటీ ప్రోగ్రామ్ అనేది ప్రపంచవ్యాప్తంగా ఎయిర్‌పోర్టు ప్యాసెంజర్స్ సంతృప్తికర స్థాయిని కొలవడానికి బెంచ్ మార్క్‌గా పరిగణిస్తారు. ఇది విమానాశ్రయాల పరిమాణం, ప్రాంతం, డెడికేటెడ్ స్టాఫ్, ఈజీఎస్ట్ ఎయిర్‌పోర్టు జర్నీ, డెడికేటెడ్ స్టాఫ్, ఎంజాయబుల్, క్లీనెస్ట్ ఎయిర్‌పోర్టు వంటి అంశాల ఆధారంగా ఎయిర్‌పోర్టుకి ర్యాంకింగ్స్ ఇస్తుంది. ఈ అవార్డు రావడం పట్ల శంషాబాద్ ఎయిర్‌పోర్టు సిఇఒ ప్రదీప్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ ఎయిర్‌పోర్టుకి బెస్ట్ రేటింగ్స్ ఇస్తున్న పాసెంజర్స్‌కి ఎప్పటికీ రుణపడి ఉంటామని, అధునాతన టెక్నాలజీని, ఇన్నోవేషన్స్‌ని అందిపుచ్చుకుంటూ ప్రయాణీకులకు టెస్ట్ మెమొరీస్ ఇవ్వడమే తమ లక్షమని సిఇఒ ప్రదీప్ అన్నారు.

## సీఎంకు మానవత్వం కూడా లేదు : కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్**

గురుకులాల్లో మోగుతున్న విద్యార్థుల మరణమృదంగాన్ని ఆపడం చేతకాని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చివరికి కనీస మానవత్వం కూడా లేదని తేలిపోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థిని అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటనపై కేటీఆర్ విచారం వ్యక్తం చేశారు. “అసమర్థ కాంగ్రెస్ సర్కారు వల్ల ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలకేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో లాలిత్య అనే మరో తొమ్మిదో తరగతి విద్యార్థిని అనుమానాస్పదంగా మృతిచెందడం తీవ్ర దిగ్భ్రాంతికరం. కళ్లముందు విగతజీవిగా పడిఉన్న బిడ్డ మృతదేహం చూసి గుండెలు పగిలిన తల్లిదండ్రులను ఓదార్చాల్సింది పోయి, పుట్టెడు దుఖంలో ఉన్న తండ్రిని పోలీసులు అదుపులోకి తీసుకోవడం అత్యంత దుర్మార్గం. రోజురోజుకూ ప్రజల దృష్టిలో దిగజారిపోవడమే కాకుండా, కనికరం కూడా లేకుండా పోయిన కాంగ్రెస్ సర్కారు తీరును చూసి విద్యార్థుల తల్లిదండ్రులే కాదు, రాష్ట్ర ప్రజలు కూడా అసహ్యించుకుంటున్నారు. ఈ దాష్టీకానికి విద్యాశాఖ మంత్రిగా విఫలమై, హోంమంత్రిగా కూడా అట్టర్ ఫ్లాప్ అయిన ముఖ్యమంత్రిదే పూర్తి బాధ్యత. కేవలం 14 నెలల వ్యవధిలోనే ఒక రాష్ట్రంలోని గురుకులాల్లో 83 మంది విద్యార్థులు బలికావడం భారత దేశ చరిత్రలోనే ఓ చీకటి అధ్యాయం. ముఖ్యమంత్రి పూర్తి అసమర్థత వల్ల జరుగుతున్న ఈ వరుస మరణాలు ముమ్మాటికీ కాంగ్రెస్ సర్కారు చేసిన హత్యలే. అందుకే రాష్ట్ర ప్రభుత్వంపై హత్యానేరం కింద కేసులు నమోదుచేయాలి. బాలిక మరణంపై తల్లిదండ్రులు అనేక అనుమానాలు వ్యక్తంచేస్తున్నందున ఈ దారుణంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. విద్యార్థులకు కనీసం మంచి భోజనం పెట్టడం కూడా చేతకాని ప్రభుత్వం చివరికి వారి ప్రాణాలను కూడా బలితీసుకోవడం సంక్షోభంలో కూరుకుపోయిన విద్యావ్యవస్థకు అద్దం పడుతోంది. ప్రభుత్వ నిర్లక్ష్యానికి అర్ధాంతరంగా రాలిపోతున్న ఈ విద్యాకుసుమాల పాపం ముఖ్యమంత్రికి తగలక మానదు. దయ లేని కాంగ్రెస్ ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించుకోకతప్పదు.

## దద్దరిల్లిన పార్లమెంటు

(మొదటి పేజీ తరువాయి)

సభల్లో గందరగోళం నెలకొంది.

రాజ్యసభలో త్రిభాష విధానం, డీలిమిటేషన్ అంశాలను ప్రతిపక్ష పార్టీలు లేవనెత్తాయి. ‘డూప్లికేట్’ ఓటరు ఐడీ కార్డుల నుంచి అమెరికా నిధుల వరకు ఓటర్ల సంఖ్య వంటి అంశాలపై చర్చలకు ఇచ్చిన నోటీసులను తిరస్కరించిన తరువాత సభను సభ్యులు వాకౌట్ చేశారు. ఈ అంశంపై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చెలరేగింది. ప్రతిపక్షం వాకౌట్‌పై కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా విమర్శలు చేశారు. ప్రతిపక్షాలు వాయిదా తీర్మానానికి ముందు నిబంధనలను చదువుకోవాలన్నారు. వాళ్లు ఏమాత్రం బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారని, ప్రతిపక్ష నేత సహా ప్రతిపక్ష పార్టీ నేతలు రిఫ్రెషింగ్ కోర్సుకు వెళ్లి నియమ నిబంధనలను అవగాహన చేసుకోవాలని సూచించారు.

ప్రతిరోజూ ప్రతిపక్ష సభ్యులు వాయిదా తీర్మానం ఇస్తుండటం పార్లమెంటరీ వ్యవస్థ ప్రతిష‘ను తగ్గించడమేనని విమర్శించారు. నిబంధనల కింద ప్రతి అంశాన్ని చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అయితే దీనిపై ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే కౌంటర్ ఇచ్చారు. వాయిదా తీర్మానం ఇవ్వడం సభ్యుని హక్కు అని అన్నారు. నిబంధనలు మీరు చదువుకోవాలని హితవు పలికారు.

## రేపటి నుంచి బడ్జెట్ సమావేశాలు

(మొదటి పేజీ తరువాయి)

సందీప్‌కుమార్ సుల్తానియా, శైలజా రామయ్యర్, సంజయ్ కుమార్, దాన కిషోర్, శ్రీధర్, ఎస్.ఎ.యం. రిజ్వీ, కార్యదర్శులు యోగితా రాణా, లోకేష్ కుమార్, క్రిస్టినా జెడ్ చోంగ్తు, బుద్ధ ప్రకాష్ జ్యోతి, రఘునందన్ రావు, అనితా రామచంద్రన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 2 నుంచి జెఇఇ మెయిన్ సెషన్ 2 పరీక్షలు

**బలగం టీవీ, హైదరాబాద్**

జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(జెఇఇ) మెయిన్ రెండో విడత పరీక్షల షెడ్యూల్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఎ) విడుదల చేసింది. ఏప్రిల్ 2,3,4,7,8 తేదీలలో పేపర్ 1 పరీక్షలు, ఏప్రిల్ 9న పేపర్ 2ఎ, 2బి పరీక్షలు జరుగనున్నట్లు వెల్లడించింది. జెఇఇ మెయిన్ పరీక్షలను ఏటా రెండు విడతల్లో నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే తొలి విడత పరీక్ష పూర్తి చేసి ఫలితాలను వెల్లడించగా, తాజాగా రెండో సెషన్ పరీక్ష నిర్వహణకు ఎన్‌టిఎ ఏర్పాట్లు చేస్తోంది. దేశవ్యాప్తంగా పలు నగరాలతో పాటు విదేశాలలోని 15 నగరాలలో జెఇఇ మెయిన్ నిర్వహించేందుకు ఎన్‌టిఎ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. త్వరలోనే జెఇఇ రెండో విడత పరీక్షలకు సంబంధించి సిటీ ఇంటిమేషన్ స్లిప్పుఉల, అడ్మిట్ కార్డులు విడుదల చేయనున్నారు.



## కెనడా కొత్త ప్రధానిగా మార్క్ కార్నీ

**బలగం టీవీ, హైదరాబాద్**

కెనడా కొత్త ప్రధానిగా మార్క్ కార్నీ త్వరలో పదవీబాధ్యతలు చేపట్టబోతున్నారు. లిబరల్ పార్టీ నాయకుడీగా 59 మార్క్ కార్నీ ట్రూడో స్థానంలో ఎన్నికయ్యారు. ట్రూడో కెనడా ప్రధాని పదవికి జనవరి లో రాజీనామా చేశారు. మార్క్ కార్నీ ప్రమాణ స్వీకారం చేపట్టేవరకూ ట్రూడో ప్రధానిగా కొనసాగుతారు. కాగా, తాను పదవి చేపట్టిన తర్వాత కెనడా - భారత సంబంధాలను పునర్నించేందుకు కృషి చేస్తానని ఎన్నికకు ముందే మార్క్ కార్నీ వెల్లడించారు. మార్క్ కార్నీ గతంలో బ్యాంక్ ఆఫ్ కెనడా, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ గవర్నర్ గా పనిచేశారు. కెనడా ప్రధానిగా అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత భారతదేశంలో గల సంబంధాలను పునర్నిర్మిస్తానని, అలాగే ఇతర దేశాలతో నూ వాణిజ్య సంబంధాలను విస్తృత పరుస్తానని మార్క్ కార్నీ వెల్లడించారు. లిబరల్ పార్టీ నాయకుడిగా ఎన్నికయ్యేందుకు ముందు ఓ సమావేశంలో ఆయన ప్రసంగించారు. అన్నిదేశాలతో విలువలతో కూడిన వాణిజ్య సంబంధాలను కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. అమెరికా ప్రెసిడెంట్ డోనాల్ ట్రంప్ తో కెనడా విలీనం ముప్పు, ట్రేడ్ వార్ ఎదుర్కొంటున్న నేపథ్యంలో మార్క్ కార్నీ ఆచీ తూచీ మాట్లాడారు.

## ప్రభుత్వ పాలన వైఫల్యం వల్ల ఎండిపోతున్న పంటలు

(మొదటి పేజీ తరువాయి)

వెళ్లి చేపల కూరలు తినొచ్చు కానీ, రాష్ట్రంలో నీటి సమస్యపై పట్టించుకోవడం లేదు,” అంటూ హరీష్ రావు విమర్శలు గుప్పించారు. మహబూబ్‌నగర్ జిల్లా సహా తెలంగాణ వ్యాప్తంగా పంటలు ఎండిపోతున్నాయని అన్నారు.

బిల్లులు సకాలంలో చెల్లించకపోవడం, మోటార్లు సరిగా నిర్వహించకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని హరీష్ రావు అన్నారు. “కేసీఆర్ హయాంలో 99% దేవాదుల ఫేజ్-3 పనులు పూర్తయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ మోటార్లను ప్రారంభించి రైతులను ఆదుకోవాలి,” అని హరీష్ రావు డిమాండ్ చేశారు.

హరీష్ రావు నేతృత్వంలోని బీఆర్ఎస్ పార్టీ రైతులకు రూ. 20,000 నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేస్తోంది. యాసంగి పంట కోత దగ్గరపడుతున్నా, వానాకాలం బోనస్ ఇంకా రైతులకు అందలేదని విమర్శించారు. “ఈ ప్రభుత్వం రైతులను మోసం చేయకుండా వెంటనే చర్యలు తీసుకోవాలి. లేకుంటే రైతుల పోరాటానికి సిద్ధంగా ఉండాలి,” అని హరీష్ రావు హెచ్చరించారు.

## టీడీఆర్ పేరిట భారీ లూటీ

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు.ప్రధాని మోదీని మంచోడు అనకపోతే జైలులో వేస్తాడని సీఎం రేవంత్ రెడ్డి భయపడుతున్నాడని కేటీఆర్ అన్నారు. ఆ పని కిషన్ రెడ్డి చేయలేడని.. ఆయన నిస్సహాయుడు అని చెప్పారు. అందుకే కిషన్ రెడ్డిపై రేవంత్ రెడ్డి ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. వరంగల్‌లో ఎయిర్‌పోర్టుకు కృషి చేసింది ఎవరో అందరికీ తెలుసని ఆయన అన్నారు. మామునూరు ఎయిర్‌పోర్టు కోసం మేం కృషి చేస్తే.. కాంగ్రెస్ నాయకులు పేరు పెట్టుకుంటున్నారని మండిపడ్డారు. తమకు ఉన్న బలంతోనే ఒక ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తున్నామని తెలిపారు.

### అసెంబ్లీకి కేసీఆర్ వస్తారు

తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు హాజరవుతారని కల్వకుంట్ల తారకరామారావు చెప్పారు. అసెంబ్లీ సమావేశాల తొలి రోజున గవర్నర్ ప్రసంగానికి కేసీఆర్ హాజరవుతారని తెలిపారు. బడ్జెట్ ప్రసంగంలోనూ కేసీఆర్ పాల్గొంటారని కేటీఆర్ వెల్లడించారు. ఆ తర్వాత కొన్ని కార్యక్రమాలకు కూడా కేసీఆర్ వస్తారని స్పష్టం చేశారు. కానీ కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకపోవడమే మంచిదని ఒక కొడుకుగా తన అభిప్రాయమని చెప్పారు కేటీఆర్. కేసీఆర్ స్థాయికి కాంగ్రెస్‌లో ఎవరూ సరిపోరని ఆయన అన్నారు. వాళ్ల పిచ్చి మాటలు, పనికిమాలిన దూషణలు, కారుకూతలు వినడానికి కేసీఆర్ రావద్దనేది కొడుకుగా తన అభిప్రాయమని కేటీఆర్ వివరించారు.

బీఆర్ఎస్ నిర్వహించబోయే భారీ బహిరంగ సభకు వరంగల్ అనువైన ప్రాంతమని కేటీఆర్ చెప్పారు. అన్ని రకాల రవాణా సదుపాయం ఉందని అన్నారు. ప్లీనరీ విషయంలో ఇంకా నిర్ణయం తీసుకోలేదని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ త్వరలోనే నిర్ణయం తీసుకోవచ్చని స్పష్టం చేశారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున రెండు సభలు పెడితే ఇబ్బంది అని భావించామని అన్నారు.






## నకిలీ మందులిచ్చి రైతులను మోసగిస్తున్న కిసాన్ అగ్రిమాల్ షాప్ ఓనర్

**- నకిలి మందులతో ఎండిన మక్క చేను**

**- నష్టపోయిన రైతు**

**- ఫర్టిలైజర్ షాప్ ఓనర్ అవినాష్ పై కేసు నమోదు : ఎస్సై పృథ్విధర్ గౌడ్**




**బలగం టీవీ , బోయినపల్లి**

నకిలీ మందులిచ్చి రైతులను మోసగిస్తున్న కిసాన్ అగ్రిమాల్ షాప్ ఓనర్‌పై కేసు నమోదైంది. వివరాల్లోకెళ్తే.. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం నీలోజిపల్లి గ్రామానికి చెందిన ఎర్ర అనిల్ కుమార్ తన మక్క చేనుకు టర్మినేటర్ అనే మందు కావాలని వెంకట్రావుపల్లి గ్రామ శివారులో గల హెచ్.టి.ఆర్ కిసాన్ అగ్రిమాల్ ఫర్టిలైజర్ షాపు నందు అడుగగా దానికంటే మంచి మందు నా వద్ద ఉన్నదని, కెన్ బౌయ్ (KENBOUY) జి.ఆర్ 4 కేజీ అను మందు ఇచ్చి, మంచిగా పని చేస్తుందని వాడమని చెప్పాడు. ఆ మందు తీసుకువెళ్లి రైతు తన మక్క చేనుకు వేయగా, మక్కచేను మొత్తం ఎండిపోయింది. దాంతో షాపు యజమాని అవినాష్, కొండ శ్యామ్ లను సంప్రదించి మీరు ఇచ్చిన మందు సరిగా పని చేయలేదని అడగగా మాయ మాటలు చెప్పి దాటవేశారని బాడితుడు తెలిపారు. షాపు యజమాని అవినాష్ పైన కొండ శ్యామ్, నకిలీ మందు ఇచ్చిన కంపెనీ, చేను చూడడానికి వచ్చిన గట్టయ్య అను కంపెనీ సైంటిస్ట్ పైన బాధితుడు ఎర్ర అనిల్ కుమార్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పృద్విదర్ గౌడ్ అన్నారు.

## మంత్రిని కలిసిన యువజన కాంగ్రెస్ నాయకులు

**బలగం టీవీ , తంగళ్లపల్లి**



వేములవాడ లో శ్రీ రాజేశ్వర గౌడ చారిటబుల్ ట్రస్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ని యువజన కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ అధ్యక్షులు చుక్క రాజశేఖర్, తంగళ్ళపల్లి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రశాంత్ మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు.

## జిల్లా పంచాయతీ అధికారిగా షర్పుద్దీన్..

**బలగం టీవీ , సిరిసిల్ల**

జిల్లా పంచాయతీ అధికారిగా షర్ఫుద్దీన్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పలువురు జిల్లా పంచాయతీ అధికారులను బదిలీ చేస్తూ,అలాగే డివిజనల్ పంచాయతీ అధికారులకు జిల్లా పంచాయతీ అధికారిగా (రీడిప్లయోడ్) తిరిగి నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో హన్మకొండ జిల్లా పరకాల డివిజనల్ పంచాయతీ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న షర్ఫుద్దీన్ రాజన్న సిరిసిల్ల జిల్లా పంచాయతీ అధికారిగా (రీడిప్లయోడ్) తిరిగి నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసారు. ఈ మేరకు ఆయన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ను శుక్రవారం కలిసి విధుల్లో చేరారు.

## పిల్లలను చంపి దంపతుల ఆత్మహత్య..!

**బలగం టీవీ, హైదరాబాద్**



ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఓయూ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే చంద్ర శేఖర్ రెడ్డి హబ్సిగూడాలోని రవీంద్ర నగర్ లో నివాసం ఉంటున్నాడు.అతనికి భార్య కవిత ,కూతురు శ్రీతా రెడ్డి ,కుమారుడు విశ్వంత్ రెడ్డి ఉన్నాడు. చంద్రశేఖర్ రెడ్డి ప్రయివేటు ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం రాత్రి పిల్లలకు విషాన్ని ఇచ్చి వారు చనిపోయిన తరువాత బార్యా భర్తలు ఊరి వేసుకొని ఆత్మహత్యా చేసుకున్నారు. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనాస్థలానికి చేసుకొని విచారిస్తున్నారు.ఆత్మహత్యకు కారణం ఆర్థిక ఇబ్బందులే అయి ఉంటాయని అనుమానిస్తున్నారు.

# పెండింగ్ పనులన్నీ త్వరితగతిన పూర్తి చేస్తాం..

**-ఆరు నెలల్లో వంతెన నిర్మాణం పూర్తి చేస్తాం**

**-ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తుదారులు రాయితీని సద్వినియోగం చేసుకోవాలిలి**

**-ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**



**బలగం టీవీ , వేములవాడ**

తిప్పాపూర్ నుంచి వేములవాడ పట్టణాన్ని అనుసంధానం చేసే రెండో వంతెన నిర్మాణాన్ని ఆరు నెలల్లో పూర్తి చేయిస్తామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు .ఆదివారం వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ రెండో బ్రిడ్జి నిర్మాణానికి రూ 6 కోట్ల 85 లక్షల వ్యయంతో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ మర్రిపెల్లి రిజర్వాయర్, కలికోట సూరమ్మ చెరువు రిజర్వాయర్, లచ్చపేట రిజర్వాయర్, చందుర్తి మోత్కరావుపేట రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయిస్తున్నామని అన్నారు . ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారం, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా చొరవతో భారీగా నిధులను ఈ ప్రాంత అభివృద్ధికి మంజూరు చేస్తున్నారని అన్నారు .

భక్తులకు శీఘ్రంగా దర్శనం కలిగించేలా ఆలయ విస్తరణ చేపడుతున్నమని,మే నెలలో శృంగేరి పీఠాధిపతి విధుశేఖర శేఖరశర్మ వేములవాడ కు రానున్నారని,ఆలయ నిర్మాణ సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్వామి వారి దర్శనాన్ని భీమేశ్వర ఆలయంలో ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. బ్రిడ్జి నిర్మాణంలో నష్టపోయే వారికి తప్పకుండా నష్టపరిహారం చెల్లిస్తామని, భూసేకరణ చట్టం ప్రకారం తప్పకుండా న్యాయం చేస్తామని స్పష్టం అన్నారు . దుకాణాలు పూర్తిగా కోల్పోతున్న వారికి మధ్య మార్గం ద్వారా ప్రత్యామ్నాయం చూస్తున్నామని,రైల్వే లైన్లో భూమి పోతున్న వారికి కూడా తప్పకుండా న్యాయం చేస్తామని అన్నారు.

**రూ.80 లక్షలతో మార్కెట్ సముదాయం..**

వేములవాడ పట్టణంలోని రెండవ బైపాస్ రోడ్ లో రూ.80 లక్షలతో అన్నీ ఒకే రకంగా కూరగాయల సముదాయం ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు . కొనుగోలుదారులు, అమ్మకందారులకు ఉపయోగపడేలా, సౌకర్యంగా ఉండేలా నిర్మాణాలు చేయిస్తామని అన్నారు.నిత్యం తాను ప్రజల మధ్యలో ఉంటూ ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకుంటునన్నారు. కోనరావుపేట మండల పరిధిలో త్వరలోనే పెండింగ్లో ఉన్న బ్రిడ్జిల నిర్మాణాన్ని చేపడతామని, వేములవాడ పట్టణంలో గంగమ్మ దేవాలయానికి ఒక నడిచిపోయేట్రాక్ ఏర్పాటు చేస్తామని అన్నారు.

ప్రజలు తమ ఫ్లాట్లను క్రమబద్ధికరించుకునేందుకు ప్రభుత్వం ఈ నెల 31వ తేదీ వరకు అవకాశం కల్పించిందని, అర్హులైన వారందరూ తప్పకుండా వినియోగించుకోవాలని,తద్వారా 25 శాతం రాయితీ కల్పిస్తారని అన్నారు . వేములవాడ నియోజకవర్గంలో అర్ధాంతరంగా ఆగిపోయిన అన్ని పనులను పూర్తి చేస్తామని అన్నారు.

**విప్ ప్రత్యేక శ్రద్ధతోనే..**

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

వేములవాడలో దాదాపు 10 సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక శ్రద్ధతోనే పనులు ప్రారంభమయ్యాయని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి, ఆయా శాఖ మంత్రులను ఒప్పించి బ్రిడ్జి నిర్మాణ పనులకు ప్రభుత్వ విప్ నిధులు మంజూరు చేయించారని గుర్తు చేశారు. భూసేకరణ ఇతర పనులను రెండు నెలల్లో పూర్తి చేసిన వేములవాడ ఏ ఆర్డీవో, తహసిల్దార్, ఆర్ అండ్ బి, మున్సిపల్ శాఖ, నీటిపారుదల అధికారులను కలెక్టర్ అభినందించారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బీ డీఈ శాంతయ్య, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, డి ఈ శాంతయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ పాలకవర్గ సభ్యులు తదితరులు ఉన్నారు.



## ప్రజావాణితో సమస్యలు పరిష్కారం..

**● కలెక్టర్ సందీప్ కుమార్ ఝాలి**

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల**

ప్రజావాణిలో వచ్చే సమస్యలు పరిష్కరిస్తున్నామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు . జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించి కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే అర్జీలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, పెండింగ్లో పెట్టవద్దని స్పష్టం చేశారు. మొత్తం 153 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.ఈ ప్రజావాణిలో సిరిసిల్ల ఇన్చార్జి ఆర్డీవో రాధా భాయ్, డీఆర్డీ ఓ శేషాద్రి, వివిధ శాఖల జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీలకు అట్రాసిటీ కేసులలో పరిహారం పంపిణీ

**-46 మందికి 36 లక్షల 87వేల 500 లు బ్యాంక్ ఖాతాల్లో జమ**

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు అట్రాసిటీ కేసుల కింద నష్ట పరిహారం పంపిణీ చేసినట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు . ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా జిల్లాలోని ఆయా మండలాల్లో నమోదైన ఎస్సీ, ఎస్టీలకు అట్రాసిటీ కేసుల ఆధారంగా మొత్తం 46 మందికి రూ.36,87,500 పరిహారం వారి వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు అట్రాసిటీ చట్టం ప్రకారం ముస్తాబాద్ మండలంలో 3, కోనరావుపేట మండలంలో 6, వేములవాడ అర్బన్, రూరల్ మండలంలో 12, సిరిసిల్ల మండలంలో 5, చందుర్తి మండలంలో 3, బోయినపల్లి మండలంలో 4, తంగళ్లపల్లి మండలంలో 5, గంభీరావుపేట మండలంలో 2, ఎల్లారెడ్డిపేట మండలంలో 2, ఇల్లంతకుంట మండలంలో 3, జగిత్యాల జిల్లాలో ఒకరికి పరిహారం పంపిణీ చేసినట్లు ఈ ప్రకటనలో వివరించారు.

## మంత్రి, ప్రభుత్వ విప్ లను కలసిన నూతన ఎస్పీ

**బలగం టీవీ, వేములవాడ**



మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ లను ఇటీవలే బదిలీపై రాజన్న సిరిసిల్ల జిల్లాకు వచ్చిన నూతన జిల్లా ఎస్పి గీతే మహేష్ బాబాసాహెబ్ కలిశారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వర దేవస్థానంలో బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ లను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

## పోసాని కృష్ణమురళికి బెయిల్ మంజూరు

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రముఖ సినీ నటుడు పోసాని కృష్ణమురళికి నరసరావుపేట జిల్లా కోర్టు బెయిల్ మంజూరు చేసింది. రూ. 10 వేల చొప్పున ఇద్దరు వ్యక్తుల పూచీకత్తుపై పోసానికి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. దర్యాప్తులో భాగంగా ఆయనను నరసరావుపేట కోర్టులో హాజరుపరిచారు. గత ఏడాది నవంబరులో నరసరావుపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోసాని కృష్ణ మురళిపై తెలుగుదేశం పార్టీ నాయకుడు కొట్టా కిరణ్ ఫిర్యాదు చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో ఆయన పేర్కొన్నారు.

# టీమ్ ఆఫ్ ద టోర్నమెంట్ అనౌన్స్ చేసిన ఐసీసీ




- **భారత్ నుంచి ఐదుగురు, న్యూజిలాండ్ నుంచి ఐదుగురు, ఆఫ్ఘనిస్థాన్ నుంచి ఇద్దరు**
- **భారత కెప్టెన్‌కు దక్కని చోటు**

**బలగం టీవి, న్యూఢిల్లీ**

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ఆదివారం తో ముగిసింది. తాజాగా టీమ్ ఆఫ్ ద టోర్నమెంట్ ను ఐసీసీ అనౌన్స్ చేసింది. ఇండియా, న్యూజిలాండ్, ఆఫ్ఘనిస్థాన్ ప్లేయర్స్ మాత్రమే ఇందులో ఉన్నారు. ఇండియా నుంచి ఐదుగురు, న్యూజిలాండ్ నుంచి ఐదుగురు, ఆఫ్ఘనిస్థాన్ నుంచి ఇద్దరు ప్లేయర్స్ కు చోటు దక్కడం విశేషం. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ఐసీసీ ప్రకటించిన జట్టులో రోహిత్‌కు స్థానం దక్కలేదు. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం ఐసీసీ జట్టులో కెప్టెన్‌గా న్యూజిలాండ్ ఆటగాడు మిచెల్ శాంట్నర్ ఎంపికయ్యాడు.

టోర్నీ మొత్తం నిలకడగా రాణించిన బ్యాటర్లు విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ తోపాటు పేస్ బౌలర్ మహ్మద్ షమి, స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఈ జట్టులో ఉన్నారు. మరో ఆల్ రౌండర్ అక్షర్ పటేల్ 12వ ప్లేయర్ గా ఉన్నాడు. కెప్టెన్ రోహిత్ శర్మకు మాత్రం ఛాన్స్ రాలేదు. ఐసీసీ ప్రకటించిన జట్టులో కేఎల్ రాహుల్ వికెట్ కీపర్‌గా ఎంపికయ్యాడు ఇక ఈ జట్టులో నలుగురు న్యూజిలాండ్ ప్లేయర్స్ కు చోటు దక్కడం విశేషం. వీళ్లలో ఓపెనర్, టోర్నీలో రెండు సెంచరీలు చేసిన రచిన్ రవీంద్ర ఒకరు. అతనితోపాటు టోర్నీలో తన కళ్లు చెదిరే ఫీల్డింగ్ తో అదరగొట్టిన గ్లెన్ ఫిలిప్స్, స్పిన్నర్ మిచెల్ సాంట్నర్, పేస్ బౌలర్ మ్యాట్ హెన్రీ ఉన్నారు. కెప్టెన్సీ మిచెల్ సాంట్నర్ కు దక్కడం విశేషం.

ఆఫ్ఘనిస్థాన్ కు చెందిన ఇద్దరు ప్లేయర్స్ టీమ్‌లో ఉన్నారు. వీళ్లలో ఛాంపియన్స్ ట్రోఫీ చరిత్రలోనే అత్యధికంగా 177 పరుగుల వ్యక్తిగత స్కోరు చేసిన ఓపెనర్ ఇబ్రహీం జద్రాన్, మిడిలార్డర్ లో అజ్మతుల్లా ఒమర్జాయ్ లకు చోటు దక్కింది.

**టీమ్ ఆఫ్ ద టోర్నమెంట్ ఇదే**

రచిన్ రవీంద్ర, ఇబ్రహీం జద్రాన్, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, గ్లెన్ ఫిలిప్స్, అజ్మతుల్లా ఒమర్జాయ్, మిచెల్ సాంట్నర్, వరుణ్ చక్రవర్తి, మహ్మద్ షమి, మ్యాట్ హెన్రీ

# ఐపీఎల్‌లో పొగాకు, మద్యం యాడ్‌లను నిషేధించాలి

## కేంద్ర ప్రభుత్వం ఆదేశం

**బలగం టీవి, న్యూఢిల్లీ**

మార్చి 22న ఐపీఎల్ ప్రారంభం కానుంది. అయితే కేంద్ర ప్రభుత్వం ఓ కీలక నిర్ణయం తీసుకుంది. ఐపీఎల్‌లో పొగాకు, మద్యం అడ్వర్టైజ్‌మెంట్‌లను నిషేధించాలని కేంద్రం ఆదేశించింది. సరోగేటరీకి సంబంధించిన యాడ్స్ కూడా ప్రసారం చేయవద్దని స్పష్టం చేసింది. యూత్‌కు రోల్ మోడల్‌గా ఉండే క్రికెట్ ప్లేయర్లకు ఇలాంటి యాడ్స్‌తో సంబంధం ఉండకూడని పేర్కొంది. ఈ మేరకు ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్‌కు కేంద్ర ఆరోగ్యశాఖ లేఖ రాసింది.

'భారత యువతకు ఆదర్శంగా ఉండే క్రికెట్ ఆటగాళ్లకు ఏ రకమైన పొగాకు లేక మద్యం ప్రకటనలతో సంబంధం ఉండకూడదు. ఐపీఎల్, సంబంధిత కార్యక్రమాలు జరిగే స్టేడియం ప్రాంగణాలు, జాతీయ మీడియాలో ప్రసారమయ్యే సెషన్‌ల సమయంలో పొగాకు, మద్యం



ప్రకటనలు ఇవ్వొద్దు. అమ్మకాలపై కూడా నిషేధం ఉంది. ఈ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలి' అని కేంద్రం ఆదేశించింది.

# 'ది కామన్‌వెల్త్ గేమ్స్ ఫెడరేషన్' ఇక 'కామన్‌వెల్త్ స్పోర్ట్'

**బలగం టీవి, న్యూఢిల్లీ**

'ది కామన్‌వెల్త్ గేమ్స్ ఫెడరేషన్' 'కామన్‌వెల్త్ స్పోర్ట్' గా కొత్త పేరు పెట్టుకుంది. మార్చి 10న కామన్‌వెల్త్ డేను పురస్కరించుకుని ఈ పేరు మార్పు ప్రకటన చేసింది. అదేవిధంగా కామన్‌వెల్త్ గేమ్స్ పరిపాలనా విభాగం పేరులో కూడా 'ఫెడరేషన్' అనే పదాన్ని తొలగించి 'మూవ్‌మెంట్' అనే పదాన్ని చేర్చారు. స్పోర్ట్స్ ఫెడరేషన్‌ను స్పోర్ట్స్ మూవ్‌మెంట్‌గా మార్చారు. 'కామన్‌వెల్త్ స్పోర్ట్' అనే బ్రాండ్ నేమ్ బలంగా ఉందని కామన్‌వెల్త్ స్పోర్ట్ సీఈవో కాటీ శాడ్లెయిర్ చెప్పారు. కామన్‌వెల్త్ గేమ్స్ ఫెడరేషన్ అనేది ఇకపై కేవలం లీగల్ ఎంటిటీగా మాత్రమే ఉండనుందని అన్నారు. కాగా, 2026లో గ్లాస్గోలో జరగనున్న కామన్‌వెల్త్ గేమ్స్‌కు సంబంధించిన కింగ్స్ బాటన్ రిలేను కామన్‌వెల్త్ స్పోర్ట్ చీఫ్ అయిన కింగ్ చార్లెస్ ప్రారంభించారు. కామన్‌వెల్త్ డే సందర్భంగా బకింగ్‌హామ్ ప్యాలెస్‌లో సోమవారం ఈ రిలే మొదలైంది. కామన్‌వెల్త్ గేమ్స్ ఓపెనింగ్ సంబురాలకు 500 రోజుల ముందు కింగ్స్ బాటన్ రిలేను మొదలుపెట్టారు. ఈ కింగ్స్ బ్యాటన్ ప్రపంచంలోని 74 దేశాలు, ప్రదేశాల్లోని కామన్‌వెల్త్ గేమ్స్ అసోసియేషన్స్ చెంతకు చేరనుంది. ఒక్కో దేశంలో ఆరు రోజుల వరకు రిలే యాక్టివిటీస్ జరగనున్నాయి.

# కన్నప్ప' నుంచి ప్రేమ పాట విడుదల




**బలగం టీవి, హైదరాబాద్**

విష్ణు మంచు నటించిన చిత్రం 'కన్నప్ప'. ఈ సినిమా నుంచి శివా శివా శంకర పాట, రీసెంట్‌గా రిలీజ్ చేసిన రెండో టీజర్‌తో సినిమా మీద అంచనాలు మరింతగా పెరిగాయి. ఈ మూవీని ఏప్రిల్ 25న ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ చేయబోతున్నారు. ఈ క్రమంలో మరింతగా ప్రమోషనల్ కార్యక్రమాలను పెంచేశారు. తాజాగా లవ్ మెలోడీ సాంగ్‌ను సోమవారం నాడు రిలీజ్ చేశారు.

విష్ణు మంచు, ప్రీతి ముకుందన్ కనిపించే 'సగమై.. చెరిసగమై' అంటూ సాగే ఈ పాటను తాజాగా విడుదల చేశారు. ఈ పాటను రేవంత్, సాహితి చాగంటి ఆలపించారు. స్టీఫెన్ దేవస్సీ బాణీ హృదయాన్ని హత్తుకునేలా ఉంది. శ్రీమణి సాహిత్యం అందరినీ ఆకట్టుకునేలా ఉంది. ఈ సాంగ్ చిత్రీకరించిన తీరు, ఇక ప్రభు దేవా, బృందా కొరియోగ్రఫీ చేసిన విధానం, విష్ణు మంచు-ప్రీతి ముకుందన్‌ను చూపించిన తీరు, వారిద్దరి మధ్య కెమిస్ట్రీ అద్భుతంగా ఉంది.

# తెలుగులోనూ 'ఛావా'కు భారీగా కలెక్షన్లు

**బలగం టీవి, హైదరాబాద్**

బాలీవుడ్ స్టార్ హీరో విక్కీ కౌశర్ లీడ్ రోల్‌లో తెరకెక్కిన 'ఛావా' తెలుగులో కలెక్షన్లతో దుమ్మురేపుతోంది. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించిన ఈ హిస్టారికల్ యాక్షన్ డ్రామా మార్చి 7న తెలుగులో రిలీజ్ అయ్యింది. తెలుగులో కూడా బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా కాసుల వర్షం కురిపిస్తోంది. రిలీజైన మూడు రోజుల్లోనే 9.46 కోట్లు వసూల్ చేసింది. ఈ మేరకు మేకర్స్ వెల్లడించారు. తొలిరోజు నుంచి ఛావా నిలకడగా వసూళ్లు సాధిస్తుంది. ఓపెనింగ్ డే రూ.3 కోట్లు వసూల్ చేసిన ఈ సినిమా, వరుసగా తర్వాతి రెండు రోజులు కూడా అదే స్థాయిలో కలెక్షన్లు సాధించింది. తెలుగులోనూ ఈ సినిమా మంచి విజయం దక్కించుకోవడం వల్ల ఇక్కడ రిలీజ్ చేసిన గీతా ఆర్ట్స్ ప్రొడక్షన్ సంస్థ హైదరాబాద్?లో థాంక్స్ మీట్ ఏర్పాటు చేసింది. ఈ సినిమాను ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపింది.

శంభాజీ మహారాజ్ జీవిత కథతో ఈ సినిమా తెరకెక్కింది. హీరో విక్కీ కౌశల్ శంభాజీ మహారాజ్‌గా, రష్మిక మంధన్నా యేసుబాయి పాత్రల్లో ఒదిగిపోయారు. వీళ్ల నటనకు ప్రశంసలు వచ్చాయి. ఔరంగజేబుగా అక్షయ్ ఖన్నా నటించారు. మ్యూజికల్ లెజెండ్ ఏఆర్ రెహ్మాన్ సంగీతం అందించారు. ఈ సినిమా అటు హిందీలో ఇప్పటికే రూ. 500 కోట్ల క్లబ్‌లో చేరిపోయింది.






# ఐఫాలో లాపతా లేడీస్‌కు పది అవార్డులు

**బలగం టీవి, న్యూఢిల్లీ**

'ఐఫా' అవార్డ్స్ వేడుక రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఘనంగా ముగిసింది. జైపూర్ ఎగ్జిబిషన్ అండ్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ నెల 8వ తేదీన అట్టహాసంగా ప్రారంభమైన ఈ వేడుక.. ఆదివారంతో ముగిసింది. మొదట డిజిటల్ అవార్డులను ప్రకటించిన నిర్వాహకులు.. ఆదివారం రాత్రి చలనచిత్ర అవార్డులు ప్రదానం చేశారు. ఈ అవార్డులలో కిరణ్ రావు దర్శకత్వంలో వచ్చిన 'లాపతా లేడీస్' సంచలనం సృష్టించింది. ఉత్తమ చిత్రం, ఉత్తమ నటి, ఉత్తమ కథ ఇలా ఏకంగా పది కేటగిరీల్లో అవార్డులు గెలుసుకుని సత్తా చాటింది. 'భూల్ భూలయ్యా 3'కు ఉత్తమ నటుడిగా కార్తిక్ ఆర్యన్ అవార్డు సొంతం చేసకున్నారు.

## 'ఐఫా' చలనచిత్ర అవార్డ్స్ విజేతలు

ఉత్తమ చిత్రం: లాపతా లేడీస్
ఉత్తమ నటుడు కార్తీక్ ఆర్యన్ (భూల్ భూలయ్యా 3)
ఉత్తమ నటి నితాన్షి గోయెల్ (లాపతా లేడీస్)
ఉత్తమ దర్శకురాలు కిరణ్ రావు (లాపతా లేడీస్)
ఉత్తమ విలన్ రాఘవ్ జుయల్ (కిల్)
ఉత్తమ సహాయ నటి జాంకీ బోడివాలా (షైతాన్)
ఉత్తమ సహాయ నటుడు రవి కిషన్ (లాపతా లేడీస్)
ఉత్తమ దర్శకుడు (తొలి పరిచయం) కునాల్ కేము (మడ్గావ్ ఎక్స్‌ప్రెస్)
ఉత్తమ నటి (తొలి పరిచయం) ప్రతిభా రంతా (లాపతా లేడీస్)
ఉత్తమ నటుడు (తొలిపరిచయం) లక్ష్య (కిల్)
ఉత్తమ నేపథ్య గాయని శ్రేయా ఘోషల్
ఉత్తమ నేపథ్య గాయకుడు జుబిన్ నౌటియల్
ఉత్తమ సంగీత దర్శకుడు రామ్ సంపత్ (లాపతా లేడీస్)
ఉత్తమ సాహిత్యం పశాంత్ పాండే (లాపతా లేడీస్)
ఉత్తమ కథ (ఒరిజినల్) బిప్లబ్ గోస్వామి (లాపతా లేడీస్)
ఉత్తమ కథ (అనువాదం) శ్రీరామ్ రాఘవన్ (మేరీ క్రిస్మస్)
స్పెషల్ ఎఫెక్ట్స్ (విజువల్స్) రెడ్ చిల్లీస్ వీఎఫ్ఎక్స్(భూల్ భూలయ్యా 3)
బెస్ట్ ఎడిటింగ్ జబీన్ మర్చంట్ (లాపతా లేడీస్)
ఉత్తమ కొరియోగ్రఫీ బోస్కో-సీజర్ (బాడ్ న్యూజ్ : తౌబా తౌబా)
ఉత్తమ సినిమాటోగ్రఫీ రఫీ మహమూద్ (కిల్)
ఉత్తమ డైలాగ్స్ అర్జున్ ధావన్, ఆదిత్య ధర్, ఆదిత్య సుహాస్ జంభలే, మోనాల్ ధాకర్ (ఆర్టికల్ 370)
ఉత్తమ స్క్రీన్‌ప్లే -స్నేహ దేశాయ్ (లాపతా లేడీస్)
ఉత్తమ సౌండ్ మిక్సింగ్ సుబాష్ సాహూ, బోలోయ్ కుమార్ డోలోయ్, రాహుల్ కర్పే (కిల్)
ఉత్తమ సౌండ్ డిజైన్ సుబాష్ సాహూ (కిల్)